



RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ గురువారం 17-04-2025 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 07 సంచిక :70 పేజీలు : 4 వెల : రూ 2-00


## జపాన్ కు చేరుకున్న సిఎం రేవంత్ రెడ్డి



టోక్యో: ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి జపాన్ చేరుకున్నారు. రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి నారిటా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఈ నెల 22 వరకు జపాన్‌లో సిఎం బృందం వర్యటించనుంది. టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమాలో పర్యటించనున్నారు. ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో లో తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించనున్నారు. జపాన్ కంపెనీలతో సిఎం బృందం చర్చలు జరుపనుంది.

# ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలి



తాగునీటి సరఫరా, సన్న బియ్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక

సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి

జిల్లా స్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం పాల్గొన్న ఎమ్మెల్యేలు





నిజామాబాద్, ఏప్రిల్ 16 ( **లోకంతీరు**) : ఇందిరమ్మ ప్రజా పాలనతో కూడిన తెలంగాణ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలు అందేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు పలికారు. సన్న బియ్యం పంపిణీ,తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యతనిస్తూ సమస్యలు తలెత్తితే సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రగతి గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా, మార్కెటింగ్, పౌర సరఫరాలు, హౌసింగ్, భూభారతి తదితర శాఖల అమలు తీరుపై మంత్రి సమగ్ర చర్చ జరిపారు. ప్రస్తుత వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. స్థానికంగా నీటి వనరులు లేని ప్రాంతాల్లో బోరుబావులు అద్దెకు తీసుకుని ప్రత్యామ్నాయ మార్గాలలో, ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని సూచించారు. అధికారులు వాస్తవ నివేదికలు ఇవ్వాలని, తాము క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతామని, ఏమైనా తేడాలు ఉంటే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాను పక్కాగా పర్యవేక్షిస్తూ, సంబంధిత నీటి పథకాల నిర్వహణ జరుపుతున్న ఏజెన్సీలకు పక్కాగా లెక్కింపులతోనే బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ గ్రిడ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో వ్యక్తికి ప్రతీరోజూ కనీసం వంద లీటర్లు, పట్టణ ప్రాంతాల్లో 150 లీటర్ల చొప్పున నీటి సరఫరా జరగాలన్నారు. ఆర్మూర్ పట్టణానికి అమృత్ పథకం కింద 43 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని, తాగునీటి సరఫరాను మెరుగుపరిచే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, రోడ్డు నిర్మాణాలు, మరమ్మతు పనులు సక్రమంగా చేపట్టకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్లను విచారణ జరిపి బ్లాక్ లిస్టులో పెట్టాలని మంత్రి జూపల్లి కలెక్టర్ కు సూచించారు. పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ, జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా కొనసాగుతోందని, నిజామాబాద్ జిల్లా నుండి ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాలకు సన్న బియ్యం సరఫరా చేస్తుండడం అభినందనీయం అని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, జిల్లాను ఆదర్శంగా నిలపాలని సూచించారు. కాగా, జిల్లాలో యాసంగిలో 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా కాగా, వాటిలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. మొత్తం 690 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని,ఇప్పటికే 426 కేంద్రాల ద్వారా రూ. 562 కోట్ల విలువ చేసే 2.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యిందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం అయిన వెంటనే రైతులకు పూర్తి వివరాలతో రసీదులు అందించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. తాగునీటి సరఫరా, ధాన్యం అమ్మకం వంటి అంశాలలో ప్రజలకు, రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వారు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా జిల్లా స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ తో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా కృషి చేయాలని హితవు పలికారు.కాగా, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, పూర్తి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ ఉండాలన్నారు. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకూడదని, ఎక్కడైనా అవినీతి అక్రమాలకు తావిస్తే రికవరీ చేయిస్తామని మంత్రి తేల్చి చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద లబ్ధిదారులకు ఐకేపీ మహిళా సంఘాల ద్వారా ఇళ్ళను నిర్మింపజేసి, ఆ తరువాత బిల్లులను మహిళా సంఘాలకు అందించేలా చొరవ చూపాలని అన్నారు. కనిష్టంగా 400 స్క్వేర్ ఫీట్లు, గరిష్టంగా 600 స్క్వేర్ ఫీట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలని, త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ జరపాలన్నారు. సన్న బియ్యం పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణ జరపాలని, రేషన్ డీలర్ల ఖాళీలను నెల రోజుల్లోపు పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని, అన్ని రేషన్ దుకాణాలకు సరైన నిష్పత్తిలో కోటా కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి వల్ల ఇబ్బందులు పడిన రాష్ట్ర రైతాంగానికి ఊరట కల్పించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ నూతన చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని, మండల, గ్రామ స్థాయిలో రైతులతో సదస్సుల నిర్వహణ కోసం నిర్ణీత షెడ్యూల్ ఖరారు చేసుకోవాలని సూచించారు. కుల, ఆదాయ, జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా రెండు రోజుల్లోపు వాటిని అందించాలని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ పక్షం రోజుల్లో మంజూరీలు తెలిపేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్హులైన ప్రతి కుటుంబానికి గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందేలా ఇంటింటి సర్వే ద్వారా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్లు చట్టభద్దతపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ




న్యూఢిల్లీ: ఇటీవల మోదీ సర్కారు ఆమోదించిన వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల పై సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో 10 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, టీఎంసి ఎంపీ మహువా మొయిత్ర, ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహమాన్, అర్జేడి ఎంపీ మనోజ్ కుమార్ ఝ, ఆప్ ఎమ్మెల్యే అమనాతుల్లా ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్, వైసీపీ, డిఎంకె, టీవికె అధినేత విజయ్, సిపిఐ సహా కొన్ని ముస్లిం సంఘాలు ఉన్నాయి. ఇక, పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు.మరోవైపు వక్ఫ్ బోర్డు సవరణ చట్టంను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు ముందు తమ వాదనలు కూడా వినాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషన్లు దాఖలు చేసిన రాష్ట్రాల్లో అస్సాం, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. వీరంతా ఈ చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఇక, కపిల్ సిబాల్ వాదనల ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాలలో తలదూర్చారని కపిల్ సిబాల్ అత్యున్నత న్యాయంస్థానం ముందుకు తీసుకెళ్లారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని కపిల్ సిబాల్ అన్నారు. "చట్టం ప్రకారం" అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని కపిల్ సిబాల్ కోర్టుకు విన్నవించారు. "చట్టం ప్రకారం" అనే పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందని ఆయన కోర్టుకు తెలిపారు. వక్ఫ్–అలల్–ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదు.. దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదు? అంటూ కపిల్ సిబాల్ న్యాయస్థానం ద?ష్టికి తీసుకెళ్లారు.అయితే, హిందువులకు సంబంధించిన వారసత్వ విషయాల్లో కూడా ప్రభుత్వం చట్టం చేసిందని.. ముస్లిం సమాజం కోసం కూడా పార్లమెంట్ చట్టం చేసింది.. ఇందులో తప్పేముందని సిజెఐ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. ఆర్టికల్ 26 అనేది సెక్యులర్. ఇది అన్ని మతాలకు వర్తిస్తుందని సిజెఐ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు.ఇస్లాంలో వారసత్వం వ్యక్తి మృతి తర్వాత జరుగుతుందని.. కానీ ప్రభుత్వం మృతికి ముందే వారసత్వం వస్తుందని చెబుతుందని కపిల్ సిబాల్ వాదించారు. ప్రభుత్వ ఆస్తిగా గుర్తించిన లేదా ప్రకటించిన ఆస్తిని కొత్త చట్టం అమలులోకి వచ్చిన తర్వాత వక్ఫ్ గా పరిగణించరాదని కొత్త చట్టంలో ఉందని కూడా కపిల్ సిబాల్ కోర్టుకు తెలిపారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర అధికారిని నియమించారని.. ఇది తనంతట తానే రాజ్యాంగ విరుద్ధమని కపిల్ సిబాల్ అన్నారు. కొత్త చట్టం అమలులోకి వస్తే ముస్లింలకు చెందిన రక్షిత స్మారకం స్థలాన్ని కూడా ఇకపై వక్ఫ్ స్థలంగా పేర్కొనలేమని కపిల్ సిబాల్ కోర్టుకు విన్నవించే ప్రయత్నం చేశారు.యితే, వాదనలు విన్న అత్యున్నత న్యాయ స్థానం ఈ వక్ఫ్ బిల్లు చట్టభద్ధతపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. రేపు మధ్యంతర తీర్పు ఇస్తామని చెప్పింది. దీంతో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

## కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానించిన కేటీఆర్

హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూములపైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆహ్వానించారు. సుప్రీం కోర్టు ఆదేశాలను బీఆర్ఎస్ పార్టీ హృదయపూర్వకంగా స్వాగతం తెలుపుతుందని కేటీఆర్ తెలిపారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అందరూ స్వాగతించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయం. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం ఇది. సుప్రీం కోర్టు ఉత్తర్వులు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యావరణ పరిరక్షణకు గొప్ప ఊతం ఇస్తాయని కేటీఆర్ తెలిపారు.గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు. 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అడవిని కాపాడి, హైదరాబాద్ భవిష్యత్తు కోసం నిలబడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# రాజీవ్ యువ వికాసం గేమ్ చేంజర్

యువకుల జీవితాలు మారుతాయి, బ్యాంకర్లకు మంచి పేరు వస్తుంది



హైదరాబాద్,ఏప్రిల్16:జిల్లాస్థాయిలో కలెక్టర్లు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలి రాజీవ్ యువ వికాసం పథకంపై బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగుల జీవితాలు మారుతాయి, వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి రాష్ట్రంలో ఈ పథకం ఒక గేమ్ చేంజర్ గా మిగులుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం జ్యోతిరావు పూలే ప్రజా భవన్లో యువ వికాసం పథకం అమలుపై బ్యాంకులతో ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం ఒక సాధారణ సంక్షేమ పథకం గా చూడవద్దని బ్యాంకర్లను కోరారు. మానవీయ కోణంలో రాష్ట్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు సుదీర్ఘ సమావేశాలు నిర్వహించి పథకానికి రూపకల్పన చేసినట్టు వివరించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఇంత పెద్ద మొత్తంలో స్వయం ఉపాధి పథకాలకు ఏనాడు ఏ ప్రభుత్వం కేటాయింపులు చేయలేదని తెలిపారు. కొలువుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత 10 సంవత్సరాలపాటు నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని అన్నారు. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే మిగిలిపోయిన నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థికంగా సామాజికంగా రాష్ట్రంలోని యువతకు సహాయపడేందుకు బ్యాంకర్లు తోడ్పాటును అందించాలన్నారు. రాజీవ్ వికాసం ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టించబడుతుంది అన్నారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మొదలు కమిషనర్ల వరకు ఈ పథకం రూపకల్పన, ఎంపికైన వారికి శిక్షణ పై తీవ్ర కసరత్తు చేసినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 6,000 కోట్లు ఖర్చు పెడుతుంది బ్యాంకర్లు 1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలి అన్నారు. ఈ పథకంలో బ్యాంకర్లు ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా మీకు మంచి పేరు దక్కుతుందని, యువ వికాసం పథకం కింద లబ్ధి పొందే యువకులకు వ్యాపారం చేసుకోవడం, లాభాలు సాధించడం పైన అధికారులు కనీసం మూడు రోజుల నుంచి 15 రోజుల వరకు శిక్షణ ఇస్తారని, వ్యాపారంలో ఇబ్బందులు ఏర్పడితే శిక్షణ సంస్థలు మద్దతు ఇస్తాయని బ్యాంకర్లకు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ బ్యాంకులు మాత్రమే ఉంటాయి మరికొన్ని ప్రాంతాల్లో రూరల్ బ్యాంకులు ఉంటాయి. ఈ పథకం విజయవంతం చేసేందుకు బ్యాంకర్లు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో త్వరలో సమావేశంలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అర్హులకు సాంక్షన్ లెటర్లు అందజేసిన తర్వాత రాష్ట్రస్థాయిలో మరోసారి ఎస్ ఎల్ బి సి సమావేశం నిర్వహిస్తాం అన్నారు. రాజీవ్ యువ వికాసంలో లబ్ధిదారులకు ప్రభుత్వ వాటా విడుదల చేయగానే, బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్టి సంక్షేమ శాఖ సెక్రెటరీ శరత్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ శ్రీధర్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, అన్ని శాఖల బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఈదురుగాలులతో వానలు..

15 జిల్లాలకు అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

హైదరాబాద్ : తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే ఛాన్స్ ఉందని చెప్పింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు పడుతాయని తెలిపింది.గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# సంపాదకీయం

గురువారం 17-04-2025

## ట్రంప్..తిరోగమనం...

ఏది ఏమైనప్పటికీ తమ దేశం నుంచి అధిక సుంకాలను వసూలు చేస్తున్న ప్రపంచ దేశాల నుంచి అదే స్థాయిలో టారిఫ్‌లను వసూలు చేస్తామని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు మడమ తిప్పుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లు కేవలం ఆర్థిక సమస్యలతోనే కాకుండా, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ వంటి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ఈ సుంకాల బారిన పడ్డాయి. ఈ దేశాలు ట్రంప్ చర్యలకు ప్రతీకార చర్యలుగా అమెరికన్ ఉత్పత్తులపై సుంకాలు విధించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి వాణిజ్య యుద్ధాలకు దారితీసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని అంటున్నారుతొలుత ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రావాల్సిన ప్రతీకార సుంకాల ఆదేశాలను 90 రోజులపాటు నిలిపివేశారు. ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి 20 సెక్టార్ల ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలను గమనిస్తే విషయం ఇట్టే అర్థమవుతున్నదివాస్తవానికి ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై భారీ టారిఫ్‌లను విధించడం వల్ల తమ దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పుంజుకుంటాయని ట్రంప్ భావించారు. అలాగే, అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు పుట్టుకొచ్చి, తమ పౌరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనేది ట్రంప్ ఆలోచన. అందుకే ముందూవెనకా ఆలోచించకుండా ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించేశారు. ఈ క్రమంలోనే చైనాపైనా టారిఫ్‌లు వేశారు.ట్రంప్ దెబ్బకు ఇతర దేశాలన్నీ కాళ్లబేరానికి వస్తే, చైనా మాత్రం అమెరికా అధ్యక్షుడికి దీటుగా బదులిస్తూ రావడం, దీంతో ఆ దేశంపై అమెరికా మరింత పెద్ద మొత్తంలో సుంకాలు ప్రకటిస్తూ రావడం చకచకా జరిగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్ విధానంతో అనేక దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నారు. ఈ చర్యలు అమెరికన్ ఉద్యోగాలను, స్థానిక పరిశ్రమలను కాపాడతాయని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, ఇవి గ్లోబలైజేషన్ యుగానికి ముగింపు పలుకుతున్నాయని పలు దేశాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, దేశాలను స్థానిక ఉత్పత్తులపై ఆధారపడేలా మార్చుతున్నాయి.1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రారంభమైన గ్లోబలైజేషన్ యుగం ఇప్పుడు ముగిసినట్లేనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు అనేక దేశాలను తమ దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, అమెరికా కూడా తన స్థానిక వనరులపై ఆధారపడే అవసరం ఏర్పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా, భారత్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు తమ ఆర్థిక విధానాలను సవరించుకుంటున్నాయి.ట్రంప్ తన టారిఫ్ విధానాన్ని సమర్థిస్తూ, అమెరికన్ పౌరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ దిగుమతులపై అధిక సుంకాలు విధించడం ద్వారా స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, విదేశీ ఉత్పత్తుల ఆధిపత్యాన్ని తగ్గించాలని ఆయన భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు అమెరికన్ వినియోగదారులకు వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తాయని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, చైనా నుంచి దిగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విడిభాగాలపై విధించిన సుంకాలు అమెరికన్ కంపెనీల ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నాయి.రెండు దేశాల మధ్య జరిగిన సుంకాల యుద్ధం పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితుల వల్ల మదుపరుల కోట్లాది సంపద ఆవిరైపోయింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికమాంద్యం ఛాయలు కనిపించాయి. ట్రంప్ వైఖరిపై ఆయన మద్దతుదారులే బహిరంగంగా పెదవి విరిచారు. దీనికి యావత్ ప్రపంచం సాక్ష్యంగా నిలిచింది. ఇంతా జరిగిన తర్వాత ట్రంప్‌కు తత్వం బోధపడినట్టు అర్థమవుతున్నది.ప్రపంచ దేశాలు ముఖ్యంగా చైనాతో పంతానికిపోతే అమెరికాకే నష్టమన్న విషయాన్ని ట్రంప్ గ్రహించినట్టు తెలుస్తున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల విషయంలో అమెరికాకు చైనా అతిపెద్ద సరఫరదారుగా ఉంది. గత ఏడాది లెక్కల ప్రకారం చైనా 88 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను, కంప్యూటర్లను అమెరికాకు ఎగుమతి చేసింది. అమెరికన్లు ఉపయోగించే ప్రతి 10 స్మార్ట్‌ఫోన్లలో నాలుగు, అలాగే ప్రతి మూడు కంప్యూటర్లలో ఒకటి చైనాలో ఉత్పత్తి అయిందే.చైనాలోనే సుమారు 80 శాతం ఐఫోన్లు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో 58 శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. దాదాపు 8 బిలియన్ డాలర్ల విలువైన ప్లాస్టిక్ కుర్చీలను చైనా నుంచే అమెరికా దిగుమతి చేసుకుంది. అలాగే, పిల్లల ఆటవస్తువులను కూడా అగ్రరాజ్యానికి పెద్దమొత్తంలో చైనా ఎగుమతి చేస్తున్నది. ఇటువంటి తరుణంలో ఆ దేశంపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు అమలు చేస్తే అంతిమంగా అమెరికన్ల జేబులకే చిల్లు పడుతుంది.ఇప్పటికిప్పుడు అమెరికాలో ఈ వస్తువుల ఉత్పత్తి సాధ్యపడదు. అందుకే ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గినట్టు అర్థమవుతున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, చిప్‌లు, సోలార్‌సెల్, మెమోరీకార్డులు వంటి ఉత్పత్తులను టారిఫ్‌ల నుంచి అమెరికా మినహాయించింది. ఈ నిర్ణయంతో ఫెంటానిల్‌పై 20 శాతం సుంకం మినహా వేరే ఏ ఇతర సుంకాలు చైనాపై భారం మోపలేకపోయాయి.డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొత్త ఒడిదొడుకులను సృష్టిస్తున్నాయి.

# అప్పుల భారం ఉన్నా... వాగ్దానాలను అమలు చేస్తున్నాం

### మంత్రి జూపల్లి కృష్ణారావు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ









నిజామాబాద్, ఏప్రిల్ 16 ( **లోకంతీరు**) : గత ప్రభుత్వ అసంబద్ధ పాలన వల్ల తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఆక్షేపించారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తోందని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని లబ్దిదారులకు బుధవారం ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్ లో మంత్రి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి రాష్ట్రాన్ని 64 సంవత్సరాల పాటు పాలించిన 21 మంది ముఖ్యమంత్రులు 64 వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తే, గత ప్రభుత్వం కేవలం పది సంవత్సరాల వ్యవధిలోనే 8 లక్షల కోట్ల అప్పులు చేసిందని దుయ్యబట్టారు. అయినా కూడా ప్రజలకు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడెకరాల సాగు భూమి, నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ వంటి హామీలను గత ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన రూ. 8 లక్షల అప్పులపై ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతీ నెల వడ్డీ రూపంలోనే 6 వేల కోట్లు, సంవత్సరానికి 70 వేల కోట్ల రూపాయలు కట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. అప్పుల భారం వల్లనే షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఇప్పటికిప్పుడు తులం బంగారం అందించలేని పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మిగితా అన్ని హామీలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ పై రూ. 500 సబ్సిడీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి ఐదు లక్షల నుండి పది లక్షల రూపాయలకు పెంపు, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ వంటి అనేక అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం తమ ప్రభుత్వ నిబద్ధత, ప్రజాపాలనకు నిదర్శనమని గుర్తు చేశారు. ధరణి



వల్ల ఇబ్బందులు పడ్డ రైతులకు భూభారతి చట్టాన్ని తెచ్చి సాంత్వన చేకూరుస్తున్నామని అన్నారు. 21 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తూ, రైతులకు రెండు లక్షల రూపాయల లోపు పంట రుణాలు మాఫీ చేశామని అన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించాలని, తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కేవలం ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తమ ప్రభుత్వం, రానున్న రోజుల్లో మరింత విస్తృత స్థాయిలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనుందని తెలిపారు. కాగా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు సంబంధిత ధృవీకరణ పత్రాలు జతచేస్తూ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న నెల రోజుల లోపు వారికి చెక్కులు అందేలా ఏర్పాట్లు చేశామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఎవరు కూడా కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి ఫోన్ కు చెక్కు మంజూరీ సమాచారం అందుతుందని సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ఆర్మూర్ నియోజకవర్గంలోని 459 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్షా 116 రూపాయల చొప్పున 4.59 కోట్ల రూపాయల విలువ చేసే చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని



వివరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండడం వల్ల చెక్కుల పంపిణీలో కొంత జాప్యం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా కౌంటర్లను నెలకొల్పి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి శంకుస్థాపనజిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద రూ. 3 కోట్లతో చేపట్టనున్న మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేసిన మంత్రి జూపల్లి



ఆర్మూర్ ఏప్రిల్ 16(లోకంతీరు):ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడు లక్కారం తవ్వన్న, ఆయన ఉమ్మడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ అడిగారు. ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబాలు విచ్చిన్నం అవుతున్నాయని, మీ లాంటి ఉమ్మడి కుటుంబాలను చూడటం, మీతో కలిసి భోజనం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి కుటుంబాల వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని, ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పేద, సామాన్య ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలామంది లబ్ధిదారులు తినేందుకు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించేవారని, సన్నబియ్యం మార్కెట్‌లో కొనుక్కుని తిరేవారన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అహ్మద్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, ఇతర, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## రైఫిల్ విభాగంలో మహిళా పోలీసులకు సిల్వర్ మెడల్




నిజామాబాదు,ఏప్రిల్16:జాతీయస్థాయిలో రైఫిల్ విభాగం లో సిల్వర్ మెడల్ సాధించిన మహిళా సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్18వ ఆల్ ఇండియా పోలీస్ షూటింగ్ ( స్పోర్ట్స్ ) ఛాంపియన్ షిప్ - 2024×జాతీయస్థాయిలో 24 మార్చ్ నుండి 29 మార్చ్ 2025 వరకు జాతియ స్థాయిలో మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించడం జరిగింది. రైఫిల్ క్రీడల యందు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ తరుపున సి హెచ్ మాధవి, మహిళా పోలీస్ కానిస్టేబుల్ : 2377, ఏ అర్ హెడ్ క్వార్టర్ పాల్గొనడం జరిగింది క్రీడలలోమాధవి సిల్వర్ మెడల్ దక్కింది.సిల్వర్ మెడల్ ప్రశంసా పత్రం నిజామాబాద్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రధానం చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రం పేరు నిలబెట్టడం ఎంతో సంతోషకరమైందని ఇదేవిధంగా భవిష్యత్తులో ఇంటర్నేషనల్ స్థాయిలో కూడా ప్రాతినిధ్యం వహించి ఎన్నో మెడల్స్ సాధించి తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క సిబ్బంది ఇదే స్ఫూర్తితో రానించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా రిజర్వు ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్ ( అడ్మిన్), తిరుపతి ( వెల్ఫేర్ ) తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో పొరుగు కూలీలు

### ఏటా తరలివస్తున్న వేలాదిమంది

నిజామాబాద్,ఏప్రిల్ 16( జిల్లాలో ధాన్యం సేకరణకు రెండు నెలల సమయం పట్టనుంది. ప్రతి సీజన్‌లో నెలరోజుల ముందుగానే కొనుగోలుపై నిర్ణయం తీసుకుని ఏర్పాట్లు చేసేవారు. ధాన్యం కేంద్రాల గుర్తింపుతో పాటు మౌలిక వసతులను అన్ని గ్రామాల పరిధిలో సమకూర్చేవారు. కొనుగోలుకు అవసరమైన గన్ని బ్యాగులు ముందే సిద్ధం చేసి ధాన్యం సేకరించేవారు. వెంట వెంటనే వాహనాలను సమకూర్చి ధాన్యాన్ని మిల్లులకు తరలించేవారు. ధాన్యం సేకరణలో కూలీలు కూడా బాగా అవసరం ఉంది. ధాన్యం సేకరణ కోసం సుమారు 12వేల మంది కూలీల అవసరం ఉంటుందని అంచనా. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వెంటనే ధాన్యం తరలించేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు కు అవసరమైన గన్నిబ్యాగులు, కూలీలు, వాహనాలపై దృష్టిపెట్టి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బీహార్, మహారాష్ట్ర నుంచి కూలీలు వచ్చి పనిచేస్తున్నారు. ప్రతి సంవత్సరం ధాన్యం సేకరణ సమయంలో బీహార్, మహారాష్ట్ర నుంచి కూలీలను రప్పించి ధాన్యం సేకరిస్తున్నారు. ఈ దఫా కూడా సహకార సొసైటీల ద్వారానే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ తర్వాత తరలించేందుకు వాహనాల అవసరం ఎక్కువగా ఉంది. అలాగే లారీలను అందుబాటులో ఉంచాలని కోరారు. వారి నుంచి లారీల వివరాలను కూడా తీసుకున్నారు. ఇవి సరిపోకపోతే గ్రామాల పరిధిలో ట్రాక్టర్‌లు, డీసీఎంలకు అవకాశం ఇచ్చి ధాన్యం తరలించాలని నిర్ణయించారు. తరలింపునకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు జిల్లాతో పాటు ఇతర జిల్లాల వాహనాలను కూడా అవసరమైతే వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో పనులు కొనసాగిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువ గ్రామాల్లో రైతులు వరి కోతలు మొదలుపెట్టినందున కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగానే ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉండడంతో ముందస్తుగా ఏర్పాట్లు చేసి కొనుగోలు ప్రారంభించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. సమయం తక్కువగా ఉన్న ఏ ఇబ్బందులు లేకుండా కొనుగోలు జరిగేవిధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రతి సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించినందున మొదట కొన్ని రోజులు చిన్న చిన్న సమస్యలు ఏర్పడిన వాటిని పరిష్కరించుకుంటూ ధాన్యం సేకరణ పూర్తిచేస్తామని వారు తెలిపారు. సమయం తక్కువ ఇచ్చిన గన్నిబ్యాగులు, ఇతర ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు.

## గులాబీ సైనికులారా తరలిరండి

### జగిత్యాల తెలంగాణ చౌరస్తా లో ఎమ్మెల్సీ కవిత వాల్ రైటింగ్

జగిత్యాల,ఏప్రిల్16:బీఆర్ఎస్ రజతోత్సవ సభకు క్యాడర్ ను ఆహ్వానిస్తూ వాల్ పెయింటింగ్ రాసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఈనెల 27న వరంగల్ లో నిర్వహించే బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ సభకు నాయకులు, కార్యకర్తలు ఇంటికొక్కరు తరలి రావాలని పిలుపుచ్చిన ఎమ్మెల్సీ కవిత




## మైనర్లకు వాహనాలు నడపడానికి ఇస్తే.. జైలు వాహన రిజిస్ట్రేషన్ రద్దు...

### నిజామాబాద్ సీ.పీ పి.సాయి చైతన్య, వెల్లడి.

### ఇక నుండి రోజు జిల్లా లో "మైనర్ స్పెషల్ డ్రైవ్"

నిజామాబాద్,ఏప్రిల్16: నిజామాబాద్ జిల్లా లో ఇప్పటివరకు మైనర్లు వాహనాలు నడుతూ పట్టుబడితే, పోలీసు వారే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానాలు వేసేవారు, మైనర్ డ్రైవింగ్ ను అరికట్టేందుకు, ఇకపై మైనర్లు వాహనం తీసుకుని రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తప్పవని నిజామాబాద్ నగర పోలీస్ కమిషనర్ పి .సాయి చైతన్య జారీ చేసిన పత్రిక ప్రకటనలో హెచ్చరించారు.మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుచన్నవి, ఇకముందు నుండి ఎవరైనా మైనర్ డ్రైవింగ్ చేస్తు దొరికితే, అట్టి మైనర్ ను మరియు తల్లిదండ్రులు వాహన యజమాని హాజరుపరుస్తారు. వాహన యజమానికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష 25 వేల రూపాయల వరకు జరిమానా విధించబడుతారు.మైనర్ల పట్టుబడిన వారికి 25 సంవత్సారాల వయస్సు నిండినంత వరకు డ్రైవింగ్ లైసెన్స్ కు అర్హుడు కాడు అట్టి వాహనం యొక్క రిజిస్ట్రేషను 1 సంవత్సారం వరకు రద్దు చేస్తామని తెలిపారు.ఎవరు కూడా మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వరాదనీ అన్నారు.

## సంకష్టహర చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

**-అధిక సంఖ్యలో దర్శించుకున్న భక్తులు**

మంథని ఏప్రిల్ 16, (న్యూస్ పల్స్) సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. సంకష్ట చతుర్థి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విగ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## చైనాపై విరుచుకుపడ్డ అమెరికా.. 245 శాతానికి దిగుమతి సుంకం పెంపు



న్యూయార్క్ : డ్రాగన్ దేశం చైనాపై అగ్రరాజ్యం అమెరికా విరుచుకుపడింది. వాణిజ్య యుద్ధం నేపథ్యంలో మరోసారి పంజా విసిరింది. చైనా దిగుమతి వస్తువులపై సుంకాన్ని 245 శాతానికి అమెరికా పెంచేసింది. తమ వస్తువులపై ప్రతీకారంగా చైనా దిగుమతి సుంకాలు పెంచిన నేపథ్యంలో ఈ చర్యకు దిగినట్లు శ్వేతసౌధం వెల్లడించింది. అమెరికా ఫస్ట్ ట్రేడ్ పాలసీ విధానంలో భాగంగా .. ఇటీవల ట్రంప్ దిగుమతి సుంకాన్ని పెంచిన విషయం తెలిసిందే. చాలా వరకు దేశాలపై సుంకాన్ని ఆయన పెంచారు. కానీ చైనాపై మాత్రం ఆ పెంపు మరీ ఎక్కువగా ఉన్నది.మెరికా దిగుమతి సుంకాన్ని పెంచిన నేపథ్యంలో.. రెండు రోజుల క్రితం చైనా కూడా కీలక నిర్ణయం తీసుకున్నది. అమెరికా సంస్థ బోయింగ్ ఉత్పత్తి చేస్తున్న విమానాలను ఖరీదు చేయవద్దు అని తమ దేశ ఎయిర్‌లైన్స్ సంస్థలకు చైనా ఆదేశించిన విషయం తెలిసిందే. బోయింగ్ సంస్థ నుంచి విడిభాగాలు కూడా కొనుగోలు చేయరాదు అని చైనా తమ దేశ ఎయిర్‌లైన్స్ సంస్థలకు చెప్పింది. ఈ ప్రకటన వెలుబడిన మరుసటి రోజే అమెరికా ప్రతీకార చర్యకు పాల్పడింది. చైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాన్ని 245 శాతానికి పెంచినట్లు వైట్‌హౌజ్ పేర్కొన్నది.

## వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగానే వడదెబ్బ బాధితులకు 4 లక్షల పరిహారం

**-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్**

మంథని ఏప్రిల్ 16, (న్యూస్ పల్స్) వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగానే వడదెబ్బ బాధితులకు 4 లక్షల పరిహారం ప్రకటించారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అన్నారు.బుధవారం మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బతో చనిపోయిన వ్యవసాయ కార్మికులకు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా చేసిన పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం వడదెబ్బతో చనిపోయిన కుటుంబాలకు 4 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించి జీవో జారీ చేసిందని ఎక్స్గ్రేషియా 4 లక్షలు కాకుండా పదిలక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం కూడా ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే ఉపాధి హామీ ప్రారంభమైన నాటి నుండి ఇప్పటివరకు కూలీల డబ్బులు ఇవ్వలేదని వెంటనే విడుదల చేసి పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## భూ సమస్యలు తీర్చడానికి భూ భారతి

**కోదండరెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్**

హైదరాబాద్ ఏప్రిల్ 16, (న్యూస్ పల్స్) కరోనా సమయంలో సైతం లెక్కచేయకుండా పంట సాగుచేసిన రైతులకు ధన్యవాదాలు. రెవెన్యూ శాఖ అన్ని శాఖలకంటే కీలకం. ఎన్ని ఇబ్బందులు వచ్చిన రైతుల కోసం కాంగ్రెస్ అధికారంలో వున్న సమయంలో చాలా సంస్కరణలు తీసుకొచ్చిందని రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. పొల్కంపల్లిలో జరిగిన రైతు కార్యక్రమంలో అయన మాట్లాడారు. ఇందిరా గాంధీ తర్వాత రేవంత్ రెడ్డి రైతు లకోసం ఎక్కువగా ఆలోచన చేస్తున్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను ఆగం చేసింది. కేసీఆర్, కేటీఆర్ కలిసి రెవెన్యూ అధికారాలను కేంద్రీకృతం చేశారు. ప్రైవేట్ కంపెనీ చేతికి ధరణి పోర్టల్ ఇచ్చారు. ధరణి వల్ల లక్షలాది మంది రైతులు ఆగమయ్యారు . సీఎం రేవంత్ రెడ్డి రైతుల భూ సమస్యలు తీర్చడానికి భూ భారతిని తీసుకొచ్చారు. నాతోపాటు న్యాయశాస్త్రం చదువుకున్న సునీల్.. భూ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారు. ఇందిరా ఏవిదంగా లక్షల ఎకరాల భూమిని పంపిణి చేసిందో.. ఈ నాడు రేవంత్ లక్షల ఎకరాల భూమిని చిక్కులను తొలగిస్తున్నారు. రైతులకోసమే రైతు కమిషన్ వేశారు. కమిషన్ లో వున్న వారాంతం రైతులుగా పనిచేసినవారే నని అన్నారు.నా జీవితంలో ఇప్పటి వరకు చూడాలే ఏకకాలంలో 21 వేలకోట్ల రుణమాఫీ చేయలేదు. 500 రూపాయల బోనస్, భరోసా పథకాలన్నీ రైతులకోసం చేసినవే.

# కాంగ్రెస్ అగ్రనేతలు ఆ పత్రికను ఏటీఎంలా వాడుకున్నరు : బీజేపీ

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసు లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ రాహుల్‌గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలు చేయడం, అందుకు ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టడం లాంటి పరిణామాల నేపథ్యంలో బీజేపీ స్పందించింది. చారిత్రక నేపథ్యంగల నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను కాంగ్రెస్ అగ్రనేతలు తమ ప్రైవేటు ఏటీఎంలా వాడుకున్నారని ఆరోపించింది.బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి నిరసన తెలిపే హక్కుందికానీ ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసి నేషనల్ హెరాల్డ్‌కు ఇచ్చే హక్కు



లేదని అన్నారు. దేశ రాజధానిలోని బహదూర్ షా జాఫర్ మార్గ్ నుంచి ముంబై, లక్నో, భోపాల్, పట్నా వరకు దేశవ్యాప్తంగా ఉన్న విలువైన ప్రజా ఆస్తులను యంగ్ ఇండియా లిమిటెడ్ ద్వారా గాంధీ కుటుంబం చేతుల్లోకి బదిలీ చేయడానికి ఈ కార్పొరేట్ కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు.'అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్' (ఏజేఎల్) కు సంబంధించిన 99% షేర్లను కేవలం రూ.50 లక్షలకు బదలాయించుకొని, రూ.2000 కోట్ల విలువ చేసే ఆస్తుల్ని గాంధీ కుటుంబం తప్పుడు మార్గాన కైవసం చేసుకుందని రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల గొంతును బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఆ వార్తా పత్రికను గాంధీల కుటుంబం తమ ప్రైవేట్ ఏటీఎంలా వాడుకుందని దుయ్యబట్టారు.ఈ కేసును కొట్టివేయించడానికి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా అవన్నీ విఫలమయ్యాయని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని అన్నారు. అక్రమాలకు పాల్పడిన వారు తప్పించుకోవడానికి ఇది కాంగ్రెస్ పాలన కాదని.. ప్రధాని నరేంద్ర మోదీ నడిపిస్తున్న దేశమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగానికి ఎవరూ అతీతులు కాదని, అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు.నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. సోనియాను ఎ-1గా, రాహుల్‌ను ఎ-2గా పేర్కొంది. తదుపరి విచారణను ఈడీ కోర్టు ఈ మనెల 25కి వాయిదా వేసింది. కేసు డైరీలను తమ పరిశీలన కోసం సమర్పించాలని ఈడీ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. కాంగ్రెస్ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దూబె తదితరులను కూడా ఈ కేసులో నిందితులుగా ఈడీ పేర్కొన్నది.

# లా కమీషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దినేశ్ మహేశ్వరి

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి 23వ లా కమీషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. లా కమీషన్ ఛైర్మెన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు న్యాయవాది హితేశ్ జైన్, ప్రొఫెసర్ డీపీ వర్మ.. కమీషన్‌లో సభ్యులుగా నియమితులయ్యారు. ఏప్రిల్ 15, 2025 నాడు వాళ్లు ఛార్జ్ తీసుకున్నారు. ఆగస్టు 31, 2027న వాళ్ల పదవీ కాలం పూర్తి అవుతుంది. కేంద్ర న్యాయ మంత్రిత్వా శాఖ .. దినేశ్ మహేశ్వరి నియామకంపై ట్వీట్ చేసింది.రాజస్థాన్‌లో సుమారు రెండు దశాబ్ధాల పాటు లాయర్‌గా జస్టిస్ మహేశ్వరి ప్రాక్టీసు చేశారు. ఆ తర్వాత 2004లో ఆయన రాజస్థాన్ హైకోర్టు బెంచ్‌కు పదోన్నత పొందారు. అలహాబాద్ హైకోర్టులో జడ్జిగా చేశారు. మేఘాలయా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, కర్నాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కూడా చేశారు. 2019 జనవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. 2023 మేలో రిటైర్ అయ్యే వరకు ఆయన సుప్రీంకోర్టులో జడ్జిగా చేశారు.లా కమీషన్ సభ్యుడిగా నియమితులైన హితేశ్ జైన్.. పరినం లా అసోసియేట్స్‌లో మేనేజింగ్ పార్ట్నర్‌గా ఉన్నారు. ముంబై ప్రదేశ్ బీజేపీలో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. రెండు దశాబ్ధాల నుంచి ఆయన లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సివిల్, క్రిమినల్, కమర్షియల్, రాజ్యాంగ అంశాల్లో అనుభవం ఉన్నది. మహారాష్ట్ర తరపున ముంబై హైకోర్టులో, సుప్రీంకోర్టులో స్పెషల్ కౌన్సిల్‌గా హాజరయ్యారు22వ భారత లా కమీషన్‌లో ప్రొఫెసర్ వర్మ పూర్తి స్థాయి



సభ్యుడిగా చేశారు. న్యాయ విద్య బోధనలో ఆయనకు నాలుగు దశాబ్ధాల అనుభవం ఉన్నది. పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, మానవ హక్కుల చట్టాల్లో ఆయన విశేష అనుభవం ఉన్నది. నేషనల్ జుడిషియల్ అకాడమీలో 2017 నుంచి 2020 వరకు అదనపు డైరెక్టర్‌గా చేశారు.కేంద్ర ప్రభుత్వ పరిధిలో లా కమీషన్ నాన్-స్టాట్యుటరీ బాడీగా పనిచేస్తుంది. దేశ చట్టాలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తుంది. సవరించాల్సిన చట్టాలను, రద్దు చేయాల్సిన చట్టాల గురించి లా కమీషన్ తన నిర్ణయాలను వెల్లడిస్తుంటుంది. న్యాయం అందరికి అందే రీతిలో, న్యాయ విభాగంలో పరిపాలన సక్రమంగా సాగే రీతిలో లా కమీషన్ వ్యవహరిస్తుంది.

# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

**50 లక్షల టన్నుల బియ్యం మిగులు**

హైదరాబాద్, ఏప్రిల్ 16, (న్యూస్ పల్స్)ఈ ఏడాది దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సంవత్సరం దాదాపు 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగిందని, ఇది ఒక రికార్డు అని ఆయన తెలిపారు. ఈ ఘనతకు రైతుల కృషి, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, ప్రకృతి సహకారం, కొత్త వరి రకాలు అందుబాటులో ఉండటం కారణమని చెప్పారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం, కేంద్ర నిల్వల కోసం 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించిన తర్వాత కూడా, రాష్ట్రంలో ఇంకా 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులు ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఈ మిగులు ధాన్యాన్ని మార్కెట్ చేయడానికి అన్వేషణలో భాగంగా, ఆగ్నేయ ఆసియాలోని ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడానికి ఆ దేశ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎంటియు-1010 మరియు ఐఆర్-64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని, వీటికి ఫిలిప్పీన్స్‌లో అధిక డిమాండ్ ఉందని ఆయన తెలిపారు.వరి సాగులో ఇటీవల రైతులు ఆదరిస్తున్న నేరుగా విత్తే పద్ధతి, రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం, తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ఆధునిక బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు,

యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని, నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతిదారులకు సరఫరా చేస్తే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# మే 1 నుంచి 15 బ్యాంకుల విలీనం

న్యూడిల్లీ, ఏప్రిల్ 16, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్, జమ్మూ మరియు కాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా మరియు రాజస్థాన్ రాష్ట్రాలలో దీని ప్రభావం కనిపించనుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మే ఒకటి నుంచి ఒక రాష్ట్రం ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు అనే విధానం అమలులోకి రానుంది. తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదన ప్రకారం 11 రాష్ట్రాలలో 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం కోసం ఒక నోటిఫికేషన్ను విడుదల చేసింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణలో ఈ విలీనం నాలుగవ దశ అని తెలుస్తుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా రీజినల్ రూరల్ బ్యాంక్ ల సంఖ్య 43 నుండి 28కి తగ్గనుందని తెలుస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో పాటు అనేక ప్రభుత్వ బ్యాంకులతో ఈ బ్యాంకులు అనుబంధంగా ఉన్నాయి. ముఖ్యంగా ఇవి గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేస్తాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దీని ప్రభావం మొత్తం దేశంలోని 11 రాష్ట్రాలలో కనిపించబోతుంది. ప్రస్తుతం ఈ రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో ఒకే సంస్థగా త్వరలో విలీనం కానున్నాయి.ఈ విధంగా తాజాగా ప్రభుత్వం ఒక రాష్ట్రం ఒక రీజినల్ రూరల్ బ్యాంకు లక్ష్యాన్ని సాధించవచ్చు.వీటి విలీనం కోసం మే 1, 2025 గా నిర్ణయించడం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు స్పాన్సర్ చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అలాగే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మరియు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ విలీనం అయ్యి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మే 1 నుంచి ఏర్పడతాయి. అలాగే ఉత్తరప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాలలోని మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఒకే సంస్థగా విలీనం కాబోతున్నాయి.ఉత్తరప్రదేశ్లో ఉన్న బరోడా యూపీ బ్యాంకు, ఆర్య వర్క్ బ్యాంకు, ప్రథమ యుపి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఉత్తరప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా ఏర్పడనున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో దీని ప్రధాన కార్యాలయం లక్నోలో ఉంటుందని సమాచారం. అదేవిధంగా బంగీయ గ్రామీణ వికాస్ బ్యాంక్ మరియు పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంక్, ఉత్తర్బాంగ్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంకును పశ్చిమ బెంగాల్లో ఏర్పాటు చేయనున్నారు.

## యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం.. ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్య భద్రతపై అవగాహన



వర్గల్, ఏప్రిల్16 : సంపూర్ణమైన ఆరోగ్య జీవితానికి ప్రతీ ఒక్కరూ యోగాసనాలు పాటించాలని వర్గల్ మండలం జెబ్బాపూర్ మహిళా సమైఖ్య సంఘం కో ఆర్డినేటర్ నర్సింలు తెలిపారు. ఇవాళ జెబ్బాపూర్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళలు పొదుపుతోపాటు, ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని నర్సింలు సూచించారు. ఎంత డబ్బు ఉన్నా, అనారోగ్యంతో బాధపడటం నరకంతో సమానమన్నారు. ఉపాధి హామీ కూలీలు సరైన ఆహారం తీసుకుంటూనే రోజూ 10 నుండి 20 నిమిషాలపాటు వీలు చేసుకొని యోగా చేసుకోవాలని సూచనలు చేశారు.యోగా ద్వారా మానసిక వత్తిడి తగ్గడమేకాకుండా, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళాగ్రూపు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## వేసవి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి : డీఎంహెచ్ఓ కోటాచలం

అర్వపల్లి, ఏప్రిల్ 16 : వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అరోగ్య సిబ్బంది ప్రజలకు



అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో సహజ కాన్పులు అయ్యే విధంగా గర్భిణీలకు సలహాలు, సూచనలు అందిస్తూ ప్రభుత్వం ద్వారా పొందే ప్రయోజనం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భూక్య నగేశ్‌నాయక్, సీహెచ్ఓ మాలోతు బిచ్చూనాయక్, సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ ఆఫీసర్ సునీత, అరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైతన్నల కోసం చలి వేంద్రాల ఏర్పాటు

చండూర్, ఏప్రిల్ 16 : నల్లగొండ జిల్లా చండూర్ మండలం కస్తాల, చండూర్ మున్సిపాలిటీ(అంగడిపేట), గుండ్రపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టీఆర్ ఫౌండేషన్ చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. బుధవారం వీటిని కస్తాల గ్రామంలో కోడి సుష్మా-వెంకన్న (ఆఅఅః డైరెక్టర్,ఈూఊ చైర్మన్), గుండ్రపల్లి గ్రామంలో ఏఓ కుమారి చంద్రిక ప్రారంభించారు. బంగారిగడ్డ, పుల్లెంల, కొండాపురం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో రైతన్నలకు చల్లని త్రాగునీరు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ కోడి సుష్మా వెంకన్న మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసిన ఖీ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్రామిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. భవిష్యత్‌లోనూ రైతుల కోసం మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాక్షించారు.ఫౌండేషన్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తాను రైతు బిడ్డనేనని తెలిపారు. ఎండలో రైతులు పడే బాధలు తనకు తెలుసు అన్నారు. రైతులకు చల్లని త్రాగునీరు అందించడం చాలా అవసరం.

## మీ హోంమంత్రిని అదుపులో పెట్టండి.. ప్రధానికి బెంగాల్ సీఎం సూచన

న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ చట్టం-2025 కు వ్యతిరేకంగా బెంగాల్‌లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారడం వెనుక ఆయన హస్తం ఉందని ఆరోపించారు. ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అని మండిపడ్డారు. అమిత్ షా, బీఎస్ఎఫ్ (ఃఈ) కలిసి కుట్రపూరితంగా వ్యవహరించారని, బంగ్లాదేశీయులను రాష్ట్రంలోకి వదిలారని వ్యాఖ్యానించారు.హోంమంత్రి అమిత్ షా దర్యాప్తు సంస్థలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని మమత మండిపడ్డారు. సొంత రాజకీయ అజెండాను నెరవేర్చుకోవడానికి దేశానికి హాని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ.. అమిత్‌షాను నియంత్రించాలని సూచించారు. ముర్షిదాబాద్ అల్లర్ల వెనుక సరిహద్దు అవతల నుంచి వచ్చిన వ్యక్తుల పాత్ర ఉందని, ఈ విషయాన్ని నిఘా వర్గాలు తమకు తెలిపాయని చెప్పారు.అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించిన దృశ్యాలను బెంగాల్‌లో జరుగుతున్నట్లు చెబుతూ సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మమత ఆరోపించారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తమ పార్టీ ముందంజలో ఉందని అన్నారు. దీనిపై ప్రజలు శాంతియుతంగా నిరసనలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దని ప్రధానిని కోరారు.హింసాకాండలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇస్తామని సీఎం మమత ప్రకటించారు. ఘర్షణల్లో బీఎస్ఎఫ్ పాత్రపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆమె ఆదేశించారు. కాగా వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హూగ్లీ జిల్లాల్లో ఆందోళనలు జరిగాయి. ఈ ఘర్షణల్లో హింస చెలరేగింది.

# సినిమా తీరు

## అందులో సునీల్ రికమండీషన్ హీరోనా!



: సునీల్ సెకెండ్ ఇన్నింగ్స్ దేదీప్యమానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. కమెడియన్ గా, హీరోగా నటించిన సునీల్ ఇప్పుడు విలన్ పాత్రలు పోషిస్తూ సక్సెస్ అవుతున్నాడు. వైవిధ్యమైన ఆహార్యంతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నాడు. ఇటీవల రిలీజ్ అయిన తమిళ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన సినిమాలో సునీల్ పాత్రకు మంచి వెయిట్ ఉంది. సాధారణంగా తమిళ సినిమాల్లో తెలుగు నటులకు అవకాశాలు రావడం కష్టమైన పనే. కోలీవుడ్ నటులకు ఇచ్చిన ప్రాధన్యత అక్కడ దర్శక హీరోలు తెలుగు నటులకు ఇవ్వరు. అందులోనూ తెలుగు వాళ్లతో టచ్ లో లేని తమిళ దర్శకులు అసలే ఛాన్స్ ఇవ్వరు. అయితే ఆధిక్ రవిచంద్రన్ సునీల్ ని ఎంపిక చేయడం అన్నది సర్ ప్రైజ్ అనే చెప్పాలి. మరి ఈ ఛాన్స్ ఎలా సాధ్యమైంది? అంటే అందుకు అసలు కారకుడు హీరో అజిత్ అని తేలింది. ఈ విషయాన్ని స్వయంగా ఆధిక్ రవిచంద్రన్ తెలిపాడు. సినిమా సక్సెస్ అయిన నేపథ్యంలో హైదరాబాద్ లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేసారు. దీనిలో భాగంగా ఆధిక్ ఈ విషయాన్ని చెప్పాడు. సునీల్ పాత్ర సినిమా కు కీలకంగా మారడం విశేషమన్నారు. ఈ సినిమాకు తెలుగు నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. మెట్రో పాలిటన్ ఆడియన్స్ ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతున్నారు. సినిమా ప్రారంభమైన పావుగంట బోర్ కొట్టినా? అజిత్ గ్యాంగ్ స్టర్ అంశం రివీల్ అయిన దగ్గర నుంచి చివరి వరకూ స్క్రీన్ ప్లే పరుగులు పెట్టిస్తుంది. ఎక్కడా ల్యాగ్ లేకుండా ఇంట్రెస్టింగ్ గా కథను, కథనాన్ని నడిపించారు. ఈ సినిమా విజయంతో ఆధిక్ రవిచంద్రన్ కు మంచి అవకాశాలు అందుకుంటాడు. ఇప్ప టికే ఆధిక్ పై టాలీవుడ్ హీరోల కన్ను పడిందనే వార్త ప్రచారంలోకి వస్తోంది.

## హిట్ 3 ట్రైలర్.. నరకాన్ని తలపిస్తోన్న అర్జున్ సర్కార్ ఊచకోత

న్యాచురల్ స్టార్ నాని నుంచి మరోసారి ఓ డిఫరెంట్ గెటప్‌లో మాస్ ట్రాన్స్ఫర్మేషన్‌ను చూపించే ట్రైలర్ వచ్చేసింది. మే 1న విడుదల కానున్న హిట్ 3: ది థర్డ్ కేస్ నుంచి ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఆ ట్రైలర్ చూస్తే నాని తన క్యారెక్టర్ లో ఎలాంటి మాస్ ఫెవర్ తీసుకురాబోతున్నాడో స్పష్టమవుతుంది. ఈసారి నాని పాత్ర పేరు అర్జున్ సర్కార్. ఓ బ్రూటల్ పోలీస్ అధికారిగా కనిపిస్తున్న నాని పాత్రలో ఎన్నో లేయర్స్ ఉన్నాయి.¯, విభిన్న లైటింగ్ స్కీమ్స్‌తో కనిపించడం సినిమాకు ఉన్న కొత్త వాతావరణాన్ని తెలిపేలా ఉంది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టెక్నికల్‌గా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ట్రైలర్‌లో నాని ఊచకోత సీన్లు నిజంగా గుగుర్పెట్టేలా ఉన్నాయి. జనంలో ఉంటే అర్జున్.. క్రిమినల్స్ మధ్యలో ఉంటే సర్కార్.. అని క్యారెక్టర్ ను బలంగా హైలెట్ చేశారు. క్రిమినల్స్ ను అసలు ఏమాత్రం వదిలి పెట్టకూడదనే తత్వంతో ఉండే అర్జున్ సర్కార్ లో ఓ లవ్ ఏమోషన్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అతని క్యారెక్టర్ ను చాగంటి ప్రవచనంతో హైలెట్ చేయడం మరో విశేషం. ముఖ్యంగా ఓ డ్రింక్ సీన్ తర్వాత ఆయన మెల్లిగా రగిలిపోతూ అరుస్తూ చెప్పే డైలాగ్ "అబ్కి బార్ అర్జున్ సర్కార్" మాస్ బ్లాక్ బస్టర్ వేటకు సంకేతమవుతుంది. ఈసారి నాని తన కంఫర్ట్ జోన్‌ను దాటి వెళ్లి మరింత హోరాహోరీగా, ఊహించని యాంగిల్‌లో కనిపిస్తున్నాడు. ట్రైలర్‌ను చూస్తే, కథలో ఏదో జరుగుతుందనే ఆసక్తి కలుగుతుంది. కథ అంతా చెప్పకుండా, కేవలం క్యారెక్టర్ హైలైట్స్, విజువల్స్, మూడ్‌ను చూపించి ప్రేక్షకుడిని ఆకర్షించే విధంగా కట్ చేశారు. నాని కనిపించిన ప్రతీ ఫ్రేమ్‌లో డిఫరెంట్ ఎనర్జీ




కనిపిస్తుంది. ముఖ్యంగా చంపే విధానం నరకాన్ని తలపించేలా ఉందనే కామెంట్స్ వస్తున్నాయి. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో మిక్కీ జే మేయర్ మరోసారి తన మార్క్ చూపించారు. ట్రైలర్‌కు అతని సంగీతం అదనపు బలంగా మారింది. అలాగే ప్రొడక్షన్ డిజైన్, స్టైలిష్ ఫ్రేమ్స్ సినిమాను విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌గా మలుస్తున్నాయి. నిర్మాత ప్రశాంతి త్రిపినేని సినిమా కంటెంట్‌కి ఏ మాత్రం కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో నిర్మించడం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తానికి 'హిట్ 3' ట్రైలర్ చూసిన తరువాత అందరిలోనూ ఒకే మాట వినిపిస్తుంది "ఈసారి నాని ఊచకోత గట్టిగానే ఉండబోతోంది.. బ్రూటల్ అర్జున్ సర్కార్" అని కామెంట్ చేస్తున్నారు. మే 1వ తేదీన ఈ సినిమా థియేటర్లలోకి వస్తోంది. ఇప్పటివరకు మెల్లిగా వెళ్లిన హిట్ ఫ్రాంచైజీకి ఈసారి నాని రూపంలో బిగ్ బాంగ్ అనిపించేలా ఉంది.

## బరువు తగ్గాలంటే రోజూ ఈ 4ఆకులు తినండి.. బెస్ట్ రిజల్ట్స్.. కానీ!!



చాలా మంది బరువు తగ్గటం కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. వ్యాయామం, ఆహార నియమాలను పాటించటంతో పాటు మరికొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బరువు గణనీయంగా తగ్గుతారని చెప్తున్నారు. నిత్యం మనం కొన్ని ఆకులను ఖచ్చితంగా మన ఆహారంలో భాగం చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. మనం నిత్యం తీసుకోవలసిన కొన్ని ఆకులను గురించి తెలుసుకుందాం. పుదీనా:పుదీనాలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో శరీర బరువును తగ్గించడానికి కూడా ఉపయోగపడుతుంది. ప్రతిరోజు మన ఆహారంలో పుదీనాను చేర్చుకుంటే అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. ఆకలిని తగ్గించే గుణాలు ఉండటంతో పాటు, త్వరగా బరువు తగ్గించే లక్షణం కూడా ఉండటంతో, బరువు తగ్గాలి అనుకునేవారు పరిమితంగా పుదీనా ఆకులను తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలి రైతు రుణమాఫీపై రేవంత్ టీం కసరత్తు - ఇలా అమలు చేద్దాం..!! కరివేపాకు:కరివేపాకులో బరువులు తగ్గించే మంచి లక్షణాలు ఉన్నాయి, కరివేపాకులో 1000 రకాల రోగాలను తగ్గించే మంచి ఔషధ గుణాలు ఉన్నాయి. కరివేపాకును ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల బరువు సులభంగా తగ్గుతారు. ఉదయాన్నే నిద్రలేచి ఖాళీ కడుపుతో కరివేపాకుని తింటే బరువు తగ్గడంతో పాటు, షుగర్ లెవెల్స్ కంట్రోల్ లో ఉంటాయి. వాము ఆకు:వాము ఆకులలోనూ బరువును తగ్గించే మంచి లక్షణాలు ఉన్నాయి. వాము ఆకుల్లో ఉండే పాలీ ఫినాల్స్ రక్తంలో ఉండే చెక్కర స్థాయిని మియంత్రించటంతో పాటు జీవక్రియను మెరుగుపరుస్తాయి. దీనివల్ల బరువు కూడా తగ్గుతుంది . మలబద్ధకాన్ని తగ్గించే శక్తి వాము ఆకులో ఉంటుంది. ఖాళీ కడుపుతో వాము ఆకు తినడం వల్ల బాగా బరువు తగ్గుతారు. పార్స్లీ ఆకు:పార్స్లీ ఆకు కొత్తిమీరను పోలి ఉంటుంది. ఇది బరువు నియంత్రణకు బాగా ఉపయోగపడుతుంది. ఎవరికైనా శరీరంలో ఫైబర్ లోపం ఉంటే ఆ లోపం తగ్గించడానికి పార్స్లీ ఆకు ఉపయోగపడుతుంది. ఇది మన బరువును బాగా నియంత్రిస్తుంది. అయితే పైన పేర్కొన్న నాలుగు ఆకులు బరువు తగ్గించే ఆకులు. అయితే వీటిని నిత్యం పరిమితంగా తీసుకోవాలి. అలా కాకుండా బరువు తగ్గాలని ఎక్కువగా తీసుకుంటే అనవసరపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

## కంప్యూటర్లు, మొబైల్స్ ఎక్కువగా వాడేవారు కళ్లు జాగ్రత్త.. ఈ ఆహారాలు తినండి!!

చాలామంది రోజంతా కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ స్క్రీన్లు చూస్తూ ఉంటారు. దీనివల్ల కంటి చూపు బలహీనపడటం మొదలవుతుంది. ఇక వయస్సు పెరుగుతుంటే కూడా కంటి చూపు మందగిస్తుంది. అయితే కంటిచూపును కాపాడుకోవటానికి చాలా మంది దృష్టి సారించరు. కంటి సమస్య ఎక్కువైన తర్వాత ఆస్పత్రుల బాట పడుతూ ఉంటారు. అయితే ముఖ్యంగా కంప్యూటర్ల ముందు పనిచేసేవారు మీ కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవటానికి ఏం



చెయ్యాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుసుకుందాం. కంటి ఆరోగ్యం కోసం ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆహారాల విషయానికి వస్తే సిట్రస్ పండ్లలో కంటి ఆరోగ్యాన్ని పెంచే పోషకాలు ఉంటాయి. బత్తాయి, నారింజ వంటి పండ్లలో కంటికి ఉపయోగపడే పోషకాలు ఉంటాయి. నారింజ పండులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, కెరోటినాయిడ్లు కంటి చూపును మెరుగుపరుస్తాయి. ప్రతీరోజూ ఒక గ్లాస్ క్యారెట్ జ్యూస్ తాగటం వలన కంటి చూపు మెరుగుపడుతుంది. క్యారెట్ లో ఉండే పోషకాలు కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చేపలు కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మరో మంచి ఆహారం. చేపలలో ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇక మన ఆహారంలో ఆకుకూరలు చేర్చుకుంటే కూడా కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. బచ్చలికూర వంటి ఆకుకూరలు కంటి ఆరోగ్యాన్ని పెంచుతాయి. కంటి ఆరోగ్యాన్ని బాదం పప్పు బాగా పెంచుతుంది. బాదం పప్పు నానబెట్టి నిత్యం రెండు పప్పులు తినటం కంటికి మేలు చేస్తుంది. గ్రుడ్లు, చికెన్ కూడా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అద్భుతమైన ఆహారం. గ్రుడ్లలో జింక్, విటమిన్ ఏ ఉంటుంది. ఇది కళ్ళకు మేలు చేస్తుంది. చికెన్ లో ఉండే ప్రోటీన్ కంటి ఆరోగ్యానికి కావాల్సిన పోషకాలను ఇస్తుంది. మనం తీసుకునే ఆహారంలో టమాటాలను చేరిస్తే మంచి ప్రయోజనం ఉంటుంది. టమాటాలలో మన కంటి చూపును కాపాడే లైకోపీన్ ఉంటుంది. ఈ ఆహారాలను కంటి చూపును మెరుగుపరచుకోవటం తీసుకోవటంతో పాటు కంప్యూటర్ల ముందు పని చేసేవారు గంటకో మారు బ్రేక్ తీసుకుని చిన్న చిన్న కళ్ళకు సంబంధించిన ఎక్సర్సైజులు చెయ్యటం మంచిది.

## నిర్మాణ రంగంలోకి హీరోయిన్ నాల్గవ ప్రాజెక్ట్!

బాలీవుడ్ లో హీరోయిన్ గా అలియాభట్ కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ లో సైతం అవకాశాలొస్తున్నా? మాతృ భాషపై మమకారంతో అక్కడే కొనసాగుతుంది. తెలుగు సినిమాల్లో బిజీ అవ్వడానికి ఇంకా ముందుంది సమయం అంటూ వెయిట్ చేస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో మాత్రం క్షణం తీరిక లేకుండా గడుపుతుంది. అలాగే సొంతంగా ఎటర్నల్ సన్ షైన్ ప్రొడక్షన్ నిర్మాణ సంస్థను స్థాపించి ఆ రంగంలోనూ బిజీగా ఉంది. ఇప్పటికే 'డార్లింగ్స్', 'జిగ్రా' లాంటి చిత్రాలు నిర్మించింది. 'పోచర్' అనే టీవీ సిరిస్ ను నిర్మించి తొలి సక్సెస్ అందుకుంది. క్రైమ్ డ్రామా ప్రేక్షకుల్ని బాగానే ఎంగేజ్ చేసింది. ఈ సిరీస్ ను సూపర్ స్టార్ మహేష్ కూడా ప్రశంసిస్తూ అప్పట్లో సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టడం తెలుగింట కలిసొచ్చింది. 'డార్లింగ్స్' యావరేజ్ గా ఆడగా 'జిగ్రా' ఆశించిన ఫలితాలు సాధించలేదు. ఆ తర్వాత మళ్లీ సొంత సంస్థలో సినిమా నిర్మాణం చేపట్టలేదు. అయితే తాజాగా అమ్మడు మరోటీవీ సిరీస్ నిర్మించడానికి రెడీ అవుతోంది. అమెజాన్ ప్రైమ్ తో కలిసి ఈ సిరీస్ నిర్మిస్తుంది. కొత్త ప్రతిభావంతుల్ని ప్రొత్సహిస్తూ చేస్తోన్న సిరీస్ ఇది. కొత్త వాళ్లను మాత్రమే తెరకు పరిచయం చేయాలనే లక్ష్యంతో అలియా భట్ ఈ ప్రాజెక్ట్ టేకప్ చేస్తుంది. దీనికి సంబంధించిన అధికా రిక వివరాలు త్వరలోనే అలియా స్వయంగా ప్రకటించనుందని సమాచారం. ఇండస్ట్రీలో తాను ఎదగడమే కాకుండా ఔత్సాహికుల్ని కూడా తెరపైకి తీసుకురావాలనే అలియా ఆలోచన ఎంతో గొప్పది.




అందానికే మరో అందం....



## 'వార్ 2' కోసం మళ్లీ అరవింద సమేత సీన్ రిపీట్!

జక్కన్న తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా విజువల్ వండర్ ఆర్ఆర్ఆర్'. ఈ సినిమాతో ఎన్టీఆర్ క్రేజ్ దేశ వ్యాప్తం అయింది. కొమురం భీమ్ పాత్రలో ఎన్టీఆర్ పలికించిన హావ భావాలకు, కళ్లతో పలికించిన నటనకుగానూ యావత్ దేశం మొత్తం ఫిదా అయింది. అంతే కాకుండా బాలీవుడ్ మేకర్స్‌తో పాటు స్టార్స్ కూడా ఎన్టీఆర్ నటనకు ఫిదా అయ్యారు. అందులో భాగంగానే ఎన్టీఆర్‌కు 'వార్ 2'లో నటించే క్రేజీ ఆఫర్ దక్కడం తెలిసిందే. 'వార్'కు సీక్వెల్‌గా రాబోతున్న ఈ మూవీలో హృతిక్ రోషన్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే.యష్‌రాజ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండియాగా మారింది. తొలి సారి ఎన్టీఆర్ నటిస్తున్న బాలీవుడ్ మూవీ కావడంతో దక్షిణాది ప్రేక్షకులు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశ నుంచి వార్తల్లో నిలుస్తూనే ఉంది. దీనికి తోడు సమయం వచ్చినప్పుడల్లా యంగ్ టైగర్ ఎన్టీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తూ ఈ ప్రాజెక్ట్‌పై హీరో హృతిక్ రోషన్ హైప్‌ని క్రియేట్ చేస్తున్నారు. 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని ఈ ఏడాది ఆగస్టు 14న అత్యంత భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో తొలి సారి ఎన్టీఆర్ నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారని, ఆ క్యారెక్టర్ హృతిక్‌ని మించి పవర్‌ఫుల్‌గా ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటి వరకు దీనికిపై టీమ్ నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఇదే నిజమని అంతా భావిస్తున్నారు. త్వరలోనే ఈమూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేయబోతున్నారు.ఇప్పటికే ప్రాజెక్ట్‌పై అంచనాలు తారా స్థాయికి చేరడంతో సౌత్‌లోనూ ఈ మూవీకి భారీ ఓపెనింగ్స్ దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ తాజాగా బయటికి వచ్చి చక్కర్లు కొడుతోంది. 'అరవింద సమేత' ఓపెనింగ్ సీన్‌లో ఎన్టీఆర్ షర్ట్ లేకుండా నటించి కేకపుట్టించిన విషయం తెలిసిందే. 'వార్ 2'లోనూ ఆ ఫీట్‌ని రిపీట్ చేసి ఫ్యాన్స్‌కి పూనకాలు తెప్పించనున్నాడట. సినిమాలో 10 నుంచి 20 నిమిషాల పాటు ఎన్టీఆర్ షర్ట్ లేకుండా కనిపిస్తాడట. ఎన్టీఆర్ ఇంట్రడక్షన్ సీన్‌లో భారీ ఫైట్ సీక్వెన్స్ ఉంటుందని, ఈ యాక్షన్ సన్నివేశాల్లో ఎన్టీఆర్ షర్ట్ లేకుండా కనిపించి ఫ్యాన్స్‌కి ఐఫీస్ట్ ఇవ్వబోతున్నాడని ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తోంది. ఎన్టీఆర్ సిక్స్ ప్యాక్ బాడీతో కనిపించనున్న ఈ యాక్షన్ సీన్ సినిమాకు హైలైట్‌గా నిలవనుందని ఇన్ సైడ్ టాక్.



## పీఎస్ఎల్ వేస్ట్.. ఐపీఎల్ బెస్ట్.. ఆ ఆటగాడి ఆన్సర్‌కు పాక్ మీడియా షాక్!

ప్రస్తుతం ఐపీఎల్(ఇండియన్ ప్రీమియర్ లీగ్) 2025 భారత్‌లో జరుగుతుండగా.. పీఎస్ఎల్(పాకిస్తాన్ సూపర్ లీగ్) 2025 పాకిస్తాన్ లో జరుగుతోంది. ఐపీఎల్ ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా మారింది. అయితే పాకిస్థాన్ ఆటగాళ్లు పాకిస్తాన్ సూపర్ లీగ్‌ను తరచుగా ఐపీఎల్‌తో పోల్చుతున్నారు. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో ఆడుతున్న ఇంగ్లాండ్ ఆటగాడు సామ్ బిల్లింగ్స్‌ను కూడా ఇలాంటి ప్రశ్నే అడిగారు. ఆ సమయంలో ఇంగ్లాండ్ ఆటగాడు సామ్ బిల్లింగ్స్ తగిన సమాధానం ఇస్తూ పాకిస్తానీ జర్నలిస్టు నోరు మూయించాడు.పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025లో లాహోర్ ఖలందర్స్ తరపున సామ్ బిల్లింగ్స్ ఆడుతున్నాడు. అయితే విలేకరుల సమావేశంలో ఐపీఎల్ వర్సెస్ పీఎస్ఎల్ గురించి అడిగినప్పుడు.. ఆశ్చర్యకరమైన సమాధానం చెప్పి పాక్ మీడియా నోరు మూయించాడు. ఎవరు ఏమి చెప్పినా తాను తన వైఖరికే కట్టుబడి ఉంటానని.. ప్రపంచంలోని ఏ ఇతర టీ20 లీగ్ కూడా ఐపీఎల్ కు సమానంగా ఉండదన్నాడు. తాను తెలివతక్కువగా ఏదైనా చెప్పాలనుకుంటున్నారా? అని బిల్లింగ్స్ అడిగాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ టోర్నమెంట్ గా ఐపీఎల్ ను విస్మరించడం కష్టమని చెప్పాడు. ఇది చాలా స్పష్టంగా ఉందని.. అనవసరంగా ఈ ప్రశ్న అడగడంలో అర్థం లేన్నాడు. ప్రపంచంలో ఏ టోర్నమెంట్ అయినా ఐపీఎల్ తర్వాతేనని



సామ్ బిల్లింగ్స్ స్పష్టం చేశాడు. పీఎస్ఎల్ ను ఐపీఎల్ తో పోల్చలేమని చెప్పాడు.ఇప్పటికే చాలా మంది క్రికెటర్లు పాకిస్తాన్ మీడియా ముందే ఐపీఎల్ మెరుగ్గా ఉందని ప్రకటించారు. కానీ పాకిస్తాన్ జర్నలిస్టులు భారత్ ను చర్చలోకి లాగడం ద్వారా ఐపీఎల్ ను తక్కువ చేసి వార్తలను సృష్టించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ పదేపదే విఫలమైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల కరాచీ కింగ్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ను ఓ పాకిస్తాన్ జర్నలిస్ట్ ఓ ప్రశ్న అడిగారు. ఐపీఎల్ లో అమ్ముడుపోకుండా పీఎస్ఎల్ లో ఆడినందుకు భారత ఫ్యాన్స్ నుంచి ఎంత ద్వేషం వచ్చిందని అడిగాడు. దానికి సమాధానమిస్తూ.. నేను దీని గురించి వినడం ఇదే మొదటి సారి అంటూ సమాధానమిచ్చాడు.మంగళవారం పీఎస్ఎల్ 2025లో భాగంగా లాహోర్ ఖలందర్స్. కరాచీ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో లాహోర్ ఖలందర్స్ 65 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన లాహోర్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. లాహోర్ ఖలందర్స్ తరపున బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఫఖర్ జమాన్ 76 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇది కాకుండా, డారిల్ మిచెల్ 75 పరుగులు చేశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.